ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
మహబూబ్‌నగర్ జిల్లా వార్తలు
బుధవారం 15 మే 2024



ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 35.0 । కనిష్ఠం : 26.0

## గ్రామ పంచాయతీ ట్రాక్టర్ దహనం

» డీజిల్ పోసి నిప్పంటించిన దుండగులు

మహమ్మదాబాద్, మే 14: గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను తగుల బెట్టిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలో సోమవారం చోటు చేసుంది. గ్రామ కార్యదర్శి శ్యామ్ తెలిపిన వివరాల ప్రకారం.. పంచాయతీ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ పోసి తగుల బెట్టారు. బ్యాటరీని దొంగిలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

## ప్రజలందరికీ కృతజ్ఞతలు

» కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మే 14: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో స్వచ్ఛందంగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న ప్రజలందరికీ కృతజ్ఞతలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజులుగా ఈ ఎన్నికల్లో తన గెలుపుకోసం ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు పని చేశారని తెలిపారు. ఎన్ని పనులున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు జిల్లాలో ప్రచార సభలకు తన తరఫున వచ్చి ప్రచారం చెప్పారు. అదేవిధంగా మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేలు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పని చేశారని, వారందరికీ ధన్యవాదాలని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పోలింగ్ బూత్‌లకు తరలివచ్చి ఓటు వేశారని, గతంలో కన్నా ఎక్కువగా ఈ ఎన్నికల్లో ఓటు వేయడం అభినందనీయమని అన్నారు. కార్యకర్తలు నెల రోజులుగా తన విజయం కోసం ఎత్తిన జెండా దించకుండా పని చేశారని, అహర్నిశలూ పని చేసిన నాయకులు, కార్యకర్తల సేవలను తాను మరువలేనని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు కేంద్రాలను పర్యవేక్షించి పోలింగ్ శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీకే ప్రజా మద్దతు

» రేవంత్ ఎన్నిసార్లు వచ్చినా నాకే అండగా నిలిచారు
» బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మహబూబ్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్, మే 14: అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా పార్లమెంట్ ఎన్నికలు జరిగాయని, ప్రజలు ఉత్సాహంగా పోలింగ్ బూత్‌లకు చేరుకుని ఓటు వేశారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఆ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి మద్దతిచ్చారని, మరోసారి మోదీ ప్రధాని కావాలని ఆశీర్వదించారని తెలిపారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే 10 శాతం ఓటింగ్ పెరిగిందన్నారు. మంగళవారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహబూబ్‌నగర్ అభ్యర్థిగా తనను మోదీ ఖరారు చేసిన నాటి నుంచే ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించిందన్నారు. ఎక్కడ చూసినా అన్ని వర్గాల ప్రజల్లో మోదీ నినాదం వినిపించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు పార్లమెంట్‌కు ఎనిమిది సార్లు వచ్చి తనను, మోదీని ఇష్టానుసారంగా దుర్భాషలాడినా బీజేపీకి బాసటగా నిలిచారన్నారు. యువకులు తిరిగితే వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి బెదిరించడం వంటి రకరకాల భయభ్రాంతులకు గురిచేసినా అవేమీ లెక్కచేయలేదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని దుయ్యబట్టారు. ఓటు వేసిన వారందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. తన విజయం కోసం పని చేసిన కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు పద్మజారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కే.రాములు, అంజయ్య, బురుజు రాజేందర్‌రెడ్డి, మెట్టుకాడి శ్రీనివాస్, కృష్ణవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎవరి అంచనా వారిదే..



మహబూబ్‌నగర్‌లోని బోయపల్లిలో సోమవారం ఓటు వేసేందుకు లైన్లో నిల్చున్న ఓటర్లు

» రెండు స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్న ప్రధాన పార్టీలు
» కొడంగల్, షాద్‌నగర్, మక్తల్, జడ్చర్ల కలిసొస్తాయని కాంగ్రెస్ ధీమా
» పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ మెజారిటీ వస్తుందంటున్న బీజేపీ
» తమ ఓట్లు ఏ పార్టీకి చీలకుండా తమకే పడ్డాయంటున్న బీఆర్ఎస్
» నియోజకవర్గాల వారీగా అంచనాలు వేసుకుంటున్న అభ్యర్థులు



మహబూబ్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పూర్తవడంతో అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. రెండు నెలలుగా క్షేత్రస్థాయిలో అవిశ్రాంతంగా ప్రచారం చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయంపై బేరీజు వేసుకోవడంలో తలమునకలయ్యారు. జూన్ నాల్గో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అయితే 2019 ఎంపీ ఎన్నికలతో పోల్చితే ఓటర్లు ఈ సారి చైతన్యం ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో నారాయణపేట, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లో 70 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. దాంతో అభ్యర్థులు ఏ నియోజకవర్గం ఎవరికి మొగ్గు చూపింది?, ఎవరికి ఎక్కడ మెజారిటీ వస్తోందని అనే విషయాలను క్రోడీకరించుకుంటున్నారు. గతంతో పోల్చితే ఈ పార్లమెంట్ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయని చెప్పొచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీని నిలుపుకుని.. పాలపొంగు వలె గెలువలేదని, ప్రజలు తమ వైపు ఉన్నారని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ కేడర్ కష్టపడింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిన బీఆర్ఎస్‌ను అధిగమించి.. తామే ప్రత్యామ్నాయ శక్తి అని చాటిచెప్పేందుకు బీజేపీ నాయకులు శ్రమించారు. ఇక అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌లో రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్.. తన పట్టు నిలుపుకుని, రెండు పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా పార్టీకి పూర్వవైభవం తెస్తామని నాయకులు చెప్పారు. అందుకే ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. అటు నాగర్‌కర్నూల్, ఇటు మహబూబ్‌నగర్ రెండు పార్లమెంట్ స్థానాల్లో 2019 కంటే పోలింగ్ ఎక్కువగా నమోదు కావడంతో అన్ని పార్టీలు గెలుపుపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

### పెరిగిన ఓటింగ్ ఎవరికి కలిసొచ్చేనో..

సాధారణంగా అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంది. కానీ ఈసారి అన్ని నియోజకవర్గాల్లో ఇంచుమించుగా అసెంబ్లీకి దగ్గరగా ఓటింగ్ శాతం నమోదైంది. ఇప్పుడు ఆ పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి కలిసి వస్తుందనే అంచనాలు వేసుకుంటున్నారు. ఏ ఎన్నికల్లోనైనా రూరల్ ప్రాంతాల్లో ఓటింగ్ ఎక్కువగా నమోదై.. పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉంటుంది. అయితే పట్టణ ప్రాంతాల్లో కూడా ఈసారి పోలింగ్ ఎక్కువ జరిగినందున తమకు కలిసి వస్తుందని బీజేపీ భావిస్తోంది. అయితే ముందు నుంచి ప్రజల నుంచి వస్తున్న స్పందన, సానుకూల ప్రభావం కొంత మారినట్లుగా తెలుస్తోంది. చివరి రోజు అన్ని పార్టీల అభ్యర్థులు ఓట్ల పోలరైజేషన్ కోసం ఖర్చు చేసినట్లు సమాచారం. దీనివల్ల కొన్ని ప్రతికూలంగా ఉన్న నియోజకవర్గాలు.. సానుకూలంగా మారినట్లు ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. బీజేపీ ప్రధానంగా తమకు సైలెంట్ ఓటింగ్ ఎక్కువ పడిందని ఆశాభావంలో ఉంది. ఏదేమైనా రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో టైట్ ఫైట్ నడవటంతో.. గెలుపు అంచనాలు వేయడం ప్రతీ ఒక్కరికి కష్టంగానే ఉందని చెప్పొచ్చు. అలాగే ఎవరు గెలిచినా మెజారిటీ తక్కువగానే ఉండనుంది.

### పాలమూరు పోరు.. ప్రతిష్టాత్మకం..

ఉమ్మడి పాలమూరు సీఎం సొంత జిల్లా కావడం.. బరిలో నిలిచిన ఇద్దరు అభ్యర్థులు కూడా కాంగ్రెస్ పార్టీలో ఉద్దండులు కావడంతో ఇక్కడ రెండు స్థానాలను గెలుచుకోవడం కాంగ్రెస్ పార్టీ అత్యంత అవసరంగా భావిస్తోంది. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా.. అన్నింటిలోనూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. అలాగే సీఎం ప్రతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం ఈ పార్లమెంట్ పరిధిలోకే వస్తుండటంతో అక్కడ భారీ మెజారిటీ వస్తుందని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తోంది. కొడంగల్‌తోపాటు షాద్‌నగర్, మక్తల్, జడ్చర్ల సెగ్మెంట్లలో కూడా కాంగ్రెస్ భారీ మెజారిటీని ఆశిస్తోంది. ఈ నియోజకవర్గాలు తమకు కలిసి వస్తున్న నేపథ్యంలో విజయం తమవైపు ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు ఒకరు తెలిపారు. అలాగే నారాయణపేట, మహబూబ్‌నగర్, దేవరకద్ర స్థానాల్లో మెజారిటీపై బీజేపీ ఎక్కువ ఆశాభావంతో ఉంది. దీంతోపాటు జడ్చర్ల, షాద్‌నగర్‌లో కూడా తమకు మెజారిటీ వస్తుందని.. విజయం తమవైపే ఉంటుందని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి కొంత అనుకూలంగా ఓట్లు పడ్డాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా.. ముస్లిం మైనారిటీలు ఏకపక్షంగా ఓటు వేసినందున.. తేడా పెద్దగా ఉండబోదని కాంగ్రెస్ అంటోంది. అలాగే పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ స్వచ్ఛందంగా ఓట్లు వేశారని బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఇక బీఆర్ఎస్ నాయకులు మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో తమకు పడిన ఓట్లన్నీ మళ్లీ ఎంపీ అభ్యర్థులకు పడ్డాయని.. మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లో తమకు మెజారిటీ వస్తుందని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఓట్లు క్రాస్ అయ్యాయని వారంటున్నారు. అయితే సైలెంట్ ఓట్, క్రాస్ ఓటింగ్‌పై మాత్రం అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో అనుమానాలు కచ్చితంగా ఉన్నాయని చెప్పొచ్చు.

### టైట్ ఫైట్‌లో ఎవరు నిలుస్తారో..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో.. మహబూబ్‌నగర్‌తో పోల్చితే ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య కొంత టైట్ ఫైట్ జరిగిందని చెప్పొచ్చు. గతంతో పోల్చితే ఇక్కడ బీజేపీ ఓటు బ్యాంకును గణనీయంగా పెరిగిందని, విజయం తమదేనని ఆ పార్టీ నాయకులు అంచనాలు వేస్తున్నారు. పట్టణ ప్రాంతాలన్నింటిలో బీజేపీకి మెజారిటీ వస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో బొటాబొటీగా వచ్చినా.. తాము బయటపడతామని భావిస్తోంది. ఇక్కడ గత పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్.. అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు స్థానాలను చేజార్చుకోవడంతో కొంత చతికిలపడినట్లు కనిపించింది. అయితే ఆ పార్టీ తరఫున ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలో నిలవడంతో వారికీ గణనీయంగా ఓట్లు వచ్చాయని అంచనాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గ పరిధిలో భారీ మెజారిటీని దక్కించుకుంది. ఆ పార్టీ అభ్యర్థి గతంలో ఎంపీగా పనిచేసిన మల్లు రవి నియోజకవర్గానికి సుపరిచితుడు. కాంగ్రెస్ కేడర్‌లో మంచి పట్టున్న నేత కావడంతో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు గెలుపు బాధ్యతను భుజాన వేసుకున్నారు. వనపర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో మెజారిటీ వస్తుందని కాంగ్రెస్ అంచనా వేసుకుంటుండగా.. గద్వాల, అలంపూర్, కల్వకుర్తి, వనపర్తి స్థానాల్లో తమకు మెజారిటీ వస్తుందని బీజేపీ భావిస్తోంది. ఇక అలంపూర్, గద్వాల, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ స్థానాల్లో తమకు మెజారిటీ వస్తుందని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు. ఇక్కడ త్రిముఖ పోరు ఉధృతంగా సాగింది. పెరిగిన ఓటింగ్ ఎవరికి కలిసొచ్చేనో..

## అమ్మకానికి.. ఆలయాల భూములు





చెన్నకేశవస్వామి ఆలయం

చెన్నిపాడులో పట్టాలుగా మార్చి, విక్రయానికి ఉంచిన చెన్నకేశవ స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల భూములు ఇవే..

» పట్టాలుగా మార్చి బేరానికి రెడీ
» చెన్నిపాడు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి..

అలంపూర్ చౌరస్తా, మే 14: జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడు గ్రామానికి చెందిన చెన్నకేశవ, ఆంజనేయ స్వాముల ఆలయ భూములను అక్రమంగా అమ్మకానికి పెట్టారు. ఆలయాల బాగోగుల కోసం గ్రామ శివారులో గల సర్వే నంబర్ 155లోని 11.09 ఎకరాల భూమిని దేవాదాయ శాఖకు సుమారు 50 ఏళ్ల కిందట అప్పగించారు. ఆలయాల బాగోగులు చూసుకుంటూ, ఆ భూమిని సాగుచేసుకుని జీవించాలని గ్రామంలో ఉండే ఓ విశ్వబ్రహ్మణ కుటుంబానికి గ్రామ పెద్దలు ఆ భూమిని అప్పగించారు. ఆ భూములు కొనడానికి, అమ్మడానికి వీల్లేదు. కొన్నేళ్లపాటు దేవుడికి సేవ చేస్తూ వచ్చిన భూమి అనుభవదారులు కాలక్రమేణ దేవుడికి సేవ చేయడం మరిచారు. గత పదేళ్లలో వ్యవసాయ భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆలయాల భుములకు ఎసరుపెట్టారు. ధరణి రాక ముందే ప్లాన్ వేసి, అప్పటి రెవెన్యూ అధికారులకు ఆమ్యామ్యాలిచ్చి అనుభవదారుడి నలుగురు కుమారులు భూమిని పట్టా చేసుకున్నారు. మంగలి పెద్ద సాయన్న పేరిట 2.38 ఎకరాలు, మంగలి చిన్న సాయన్న పేరిట 2.37, మంగలి కృష్ణమూర్తి పేరిట 2.37, మంగలి వెంకట్రాములు పేరుమీద 2.37 ఎకరాల భూమిని పట్టా చేసుకొని పాసు బుక్కులు పొందారు. గత ప్రభుత్వంలో ధరణి వచ్చాక వీరందరికీ కొత్త పాసు బుక్కులు సైతం వచ్చాయి. దీంతో భుములను విక్రయానికి ఉంచారు. ఆ భూముల ద్వారా ఏటా కౌలుకింద ఎకరానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆర్జిస్తున్నారు. పైగా ఏనాడూ దేవుడికి సేవ చేసిన దాఖలాలు లేవని గ్రామస్థులు అంటున్నారు.

### మొద్దునిద్రలో ఎండోమెంట్‌శాఖ

ఆలయాల భూములు అమ్మకానికి పెట్టారంటే ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. భూములను మరొకరి పేరుపై పట్టాలుగా మార్చిన అధికారులపై, అనుభవదారులపై వెంటనే చర్యలు తీసుకుని, వాటిని కాపాడాలని గ్రామస్థులంటున్నారు. లేదంటే ఉద్యమించాడానికి సైతం వెనుకాడబోమని అంటున్నారు.

### కోర్టులో కేసు వేస్తాం

చెన్నిపాడులోని చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి భూములు పూర్తిగా ఎండోమెంట్ పరిధిలో ఉన్నాయి. ఆ భూములు కొనరాదు, అమ్మరాదు. తహసీల్దార్ కార్యాలయంలో ఏమైనా అక్రమాలు జరిగిందొచ్చు. కానీ మా జాబితాలో ఆ భూమి నేటికీ ఎండోమెంట్ పరిధిలోనే ఉంది. పట్టాగా మార్చిన భూమి అనుభవదారులపై చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు లేఖ రాసి రాస్తాం. అవసరమైతే కోర్టులో కేసు వేస్తాం.

- ఎస్.వెంకటేశ్వరి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, జోగుళాంబ గద్వాల జిల్లా

## పాలమూరులో 72.43 శాతం నాగర్‌కర్నూల్‌లో 69.46 శాతం

» మహబూబ్‌నగర్‌లో గతం కంటే 7.04 శాతం.. కందనూలులో 7.23 శాతం ఎక్కువ

# పోలింగ్ నమోదు

మహబూబ్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 72.43 శాతం, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో 69.46 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం పోలింగ్ ఆలస్యంగా ముగిసిన నేపథ్యంలో అధికారులు చివరి ఓటర్ టర్న్ అవుట్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలో 72.43 శాతం పోలింగ్ నమోదైంది. నారాయణపేట, మహబూబ్‌నగర్ మినహా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలింగ్ శాతం 70 దాటింది. అత్యధికంగా జడ్చర్ల నియోజకవర్గంలో 77.92 శాతం నమోదు కాగా.. అత్యల్పంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 66.27 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 16,82,470 మంది ఓటర్లు ఉండగా.. 12,18,587 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురుష ఓటర్లు 8,32,256 మందికి గాను.. 6,12,924 మంది ఓటు వేయగా.. 73.65 శాతం ఓటింగ్ నమోదైంది. మహిళా ఓటర్లు 8,50,172 మందికి గాను.. 6,05,647 మంది ఓటు వేయడంతో 71.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇతర ఓటర్లు 42 మంది ఉండగా.. 16 మంది తమ ఓటు వేశారు. దాంతో 38.10 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో ఈ పార్లమెంట్ పరిధిలో 65.39 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో 72.43 శాతం నమోదైంది. ఆ ఎన్నికలతో పోల్చితే 7.04 శాతం పోలింగ్ ఎక్కువగా నమోదైంది.

### నాగర్‌కర్నూల్‌లో..

నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో 69.46 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పార్లమెంట్ పరిధిలోని గద్వాల, అలంపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో 70 శాతానికిపైగా పోలింగ్ నమోదు కాగా.. వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో 60 శాతం పైన నమోదైంది. అత్యధికంగా గద్వాల నియోజకవర్గంలో 74.93 శాతం పోలింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా అచ్చంపేట, కొల్లాపూర్‌లో నియోజకవర్గంలో 65.11 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళల కంటే పురుషులు ఎక్కువగా ఓటు వేశారు. పురుషుల ఓటింగ్ 70.89 శాతం నమోదు కాగా.. మహిళల ఓటింగ్ 68.06 శాతం నమోదైంది. ఇక్కడ మొత్తం 17,38,254 మంది ఓటర్లు ఉండగా.. 12,07,471 మంది ఓటు వేశారు. మొత్తం ఓటర్లలో పురుషులు 8,64,875 మందికి గాను 6,13,085 మంది, మహిళలు 8,73,340 మందికి గాను 5,94,367 మంది ఓటు వేశారు. ఇతర ఓటర్లు 39 మంది ఉండగా.. 19 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 48.72 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో ఈ పార్లమెంట్ పరిధిలో 62.23 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో 69.46 శాతం నమోదైంది. దాదాపు 7.23 శాతం పోలింగ్ ఎక్కువగా నమోదైంది.

**మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని సెగ్మెంట్ల వారీగా పోలింగ్ వివరాలు**

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | ఓటు వేసిన వారు | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| కొడంగల్ | 241794 | 171776 | 71.04 |
| నారాయణపేట | 236182 | 163284 | 69.13 |
| మహబూబ్‌నగర్ | 259260 | 171815 | 66.27 |
| జడ్చర్ల | 222838 | 173634 | 77.92 |
| దేవరకద్ర | 239745 | 178602 | 74.50 |
| మక్తల్ | 244173 | 174898 | 71.63 |
| షాద్‌నగర్ | 238478 | 184578 | 77.40 |
| మొత్తం | 1682470 | 1218587 | 72.43 |

**నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని సెగ్మెంట్ల వారీగా పోలింగ్ వివరాలు**

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | ఓటు వేసిన వారు | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| వనపర్తి | 273863 | 182553 | 66.66 |
| గద్వాల | 256637 | 192300 | 74.93 |
| అలంపూర్ | 240063 | 177780 | 74.06 |
| నాగర్‌కర్నూల్ | 236094 | 160394 | 67.94 |
| అచ్చంపేట | 247729 | 161301 | 65.11 |
| కల్వకుర్తి | 244405 | 177226 | 72.51 |
| కొల్లాపూర్ | 239463 | 155917 | 65.11 |

## కాంగ్రెస్ దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆందోళన



అచ్చంపేట పోలీస్‌స్టేషన్ ముందు రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అచ్చంపేట, మే 14: అచ్చంపేట పట్టణంలోని బీఆర్ఎస్ మునిసిపల్ కౌన్సిలర్ సుంకరి బాలరాజు కుటుంబంపై అధికార కాంగ్రెస్ నాయకులు మంగళవారం దాడి చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు చైర్మన్ నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సాయినగర్ కాలనీలో గల బూత్ వద్ద సోమవారం ఇద్దరు కాంగ్రెస్ నాయకులు మద్యం తాగి గొడవ పడ్డారని నాయకులు తెలిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ బాలరాజు సోదరుడు వారిని సముదాయించి, కాంప్రమైజ్ చేశారని చెప్పారు. వారిని కాంప్రమైజ్ చేసినందుకు బాలరాజు కుటుంబంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని, ఈ దాడిలో కౌన్సిలర్ తమ్ముడు మహేష్‌తో పాటు లింగం, బాలకృష్ణ, సురేష్ గాయపడ్డారని చెప్పారు. దాంతో మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు అచ్చంపేట సాయిరాం థియేటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ముందు రహదారిపై రాస్తారోకో చేశారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్ఐ రాములు ఆందోళనకారులను సముదాయించారు. తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ రామేశ్వర్‌రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### దాడులను ప్రోత్సహిస్తున్నారు: గువ్వల బాలరాజు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అచ్చంపేటలో ఎలాంటి గొడవలు లేకుండా సుభిక్షంగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే వంశీకృష్ణ మూడు నెలల్లోనే భ్రష్టు పట్టించారని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం రాత్రి ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటనపై స్పందించారు. దాడులకు పాల్పడిన వారిని పోలీసులు శిక్షించే వరకు పోరాడుతానని చెప్పారు. తాము ప్రతిదాడులకు పాల్పడబోమని, శాంతియుతంగానే ఆందోళనలు చేపడతామని అన్నారు.

## వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష

నారాయణపేట, మే 14: వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నారాయణపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి మహ్మద్ అబ్దుల్ రఫీ మంగళవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన మార్ల శ్రీను, మేకల హన్మంతు(35) 2019 ఫిబ్రవరిలో నారాయణపేట మండలం లింగంపల్లి జాతరకు వచ్చారు. శ్రీను మద్యం తాగాడు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలని మేకల హన్మంతు(35) శ్రీనును అడిగాడు. దాంతో శ్రీను హన్మంతు ఛాతిపై బలంగా కొట్టడంతో ఛాతి నొప్పి వచ్చింది. మరుసటి రోజు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించగా, అప్పటికే తన భర్త మృతి చెందాడని హన్మంతు భార్య మేకల లక్ష్మీ 2019 ఫిబ్రవరి 27న బంజరాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హైదరాబాద్ పోలీసులు కేసును నారాయణపేటకు బదిలీ చేశారు. అప్పటి ఎస్ఐ శ్రీనివాస్, సీఐ సంపత్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. కోర్టులో పీపీలు మురళీ కృష్ణ, ఆకుల బాలప్ప వాదనలు వినిపించి, సాక్ష్యులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో శ్రీనుకు శిక్ష కరారు చేస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి తీర్పునిచ్చారు.

# నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

మక్తల్, మే 14 : కర్ణాటక ప్రభుత్వం మూడు రోజుల క్రితం నారా యణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో మంగళ వారం కృష్ణానదిలోకి నీరు చేరింది. మక్తల్, నారాయణపేట ప్రాంతాలకు తాగునీటి విడుదలకు సైతం కృష్ణానదిలో నీటి నిల్వ లేకపోవడంతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 1.9టీఎంసీల నీటిని దిగువకు వదిలించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని నీటిని విడుదల చేయించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కృష్ణానది వట్టిపోవడంతో వల్లభాపురం నుంచి కృష్ణానది ఆవల ఉన్న కురుమపురానికి నదిలో తాత్కాలిక మట్టి రోడ్డు వేసుకున్నారు. మంగళవారం నదిలోకి నీరు చేరడంతో జాలర్లు, భక్తులను కురుమ పురానికి పుట్టీల్లో తరలించారు.


కృష్ణానదిలో వల్లభాపుర దత్తక్షేత్రం వద్దకు చేరిన నీరు



# వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

బిజినేపల్లి/నవాబ్‌పేట/గద్వాల/అడ్డాకుల, మే 14 : ఉమ్మడి జిల్లాలో ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. వీరిని ఆయా ఆస్పత్రుల్లో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వెల్గొండ తండాకు చెందిన రాత్లావత్ దేవి, భర్త సక్రునాయక్‌లు అనారోగ్యంతో బాధపడుతున్న కొడుకు సందీప్ నాయక్‌ను మండల కేంద్రంలో ఆసుపత్రికి బైక్‌పై ఎక్కించుకొని వస్తున్నారు. నాగర్‌కర్నూల్ నుంచి బిజినేపల్లి బస్టాండ్‌లోకి మలుపు తీసుకుంటున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు బాధితుల బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై రాత్లావత్ దేవికి కాలు విరగ్గా, సందీప్ నాయక్‌కు చెయ్యి విరిగింది. బైక్ నడుపుతున్న సక్రు నాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి చికిత్స కోసం నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన తల్లి రాత్లావత్ దేవి, కొడుకు సందీప్ నాయక్‌లు

### కేశవరావుపల్లి సమీపంలో..

నవాబ్‌పేట: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కింద పడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కేశవరావ్‌పల్లి గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రా మస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హన్మమ్మ తన కొడుకు అంజనేయులు బైక్‌పై కొల్లూర్ వెళ్లి అక్కడ పనులు ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తుండగా ఎండకు సొమ్మసిల్లి కిందపడింది. దాంతో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వెంటనే కొడుకు 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

### అనంతాపురం స్టేజీ సమీపంలో..

గద్వాల: మండల పరిధిలోని అనంతాపురం స్టేజీ సమీపంలో మంగళవానం రెండు బైక్‌లు ఎదురెదురుగా వెళ్లి ఢీకొని కొన్నాయి. ఇందులో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని గద్వాల ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అయితే వీరి వివరాలు తెలియలేదు. ఈ విషయంపై రూరల్ ఎస్సై పర్వతాలు తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

### అడ్డాకుల మండల సమీపంలో..

అడ్డాకుల: మహబూబ్‌నగర్‌జిల్లా అడ్డాకుల దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డాకుల మండల పరిధిలోని గుడిబండకు చెందిన భార్యాభర్తలు కొన్నూరు శ్రీనివాసులు, సుజాత వారి పిల్లలు, బంధువులతో కలిసి కారులో అలంపూర్ జోగులాంబ దేవాలయానికి దర్శనానికి వెళ్లారు. తిరిగి గుడిబండకు వెళ్తుండగా అడ్డాకుల దగ్గర కొత్తకోట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వాహనం వెనుక వైపు కారును ఢీకొన్నది. దాంతో కొన్నూరు శ్రీనివాసులుకు, సుజాతకు తీవ్రగాయాలు అయ్యాయి. మిగతా వారికి స్వల్పంగా దెబ్బలు తగిలాయి. 108 సిబ్బంది బాధితులను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కాగా పోలీసులు కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. కేసు వివరాలు తెలియాల్సి ఉన్నది.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


బాధితులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

# వైన్స్ నిర్వాహకులపై హత్యకేసు

- గత నెల 25న కస్టమర్‌పై దాడి
- చికిత్సపొందుతూ మృతి

మహబూబ్‌నగర్, మే14: మద్యం కొనుగోలు కోసం వెళ్లిన ఓ కస్టమర్‌పై మద్యం దుకాణం నిర్వాహకులు విచక్షణారహితంగా దాడి చేశారు. కర్రలతో కొట్టడమేకాక పిడిగుద్దులు గుద్దడంతో తీవ్ర గాయాలైన అతను 15 రోజులపాటు చికిత్స పొం దుతూ మంగళవారం మరణించాడు. బాధిత కు టుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వారి ఫిర్యా దు మేరకు వైన్స్ నిర్వాహకులపై పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతనెల 25న బండమీదిపల్లి వైన్స్‌కు బీర్ కోసం అడ్డాకుల మండలం బలీద్‌పల్లికి చెందిన శ్రీకాంత్ వెళ్లాడు. బీరు అడిగితే కొద్దిసేపు ఆగాలన్నారు. త్వరగా ఇవ్వాలని అడగడంతో కౌంటర్‌పై ఉన్న వ్యక్తి తిట్టడంతో మాటామాటా పెరిగింది. దీంతో వైన్స్‌షాపు నిర్వాహకులు అతన్ని లోపలికి లాగి విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలైన అతను ఇంటికెళ్లి కుటుంబ సభ్యులకు బైక్‌పై నుంచి కిందపడ్డానని చెప్పాడు. నాలుగైదురోజుల తరువాత వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడు తుండగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. స్కానింగ్ చేస్తే పేగులు, లీవర్ దెబ్బతిన్నాయని చెప్పడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం చనిపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితులు తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వైన్స్ నిర్వాహకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బబ్లూ, వెంకటేశ్‌తోపాటు మరి కొందరు దాడి చేయడంతో తన కొడుకు చనిపోయాడని మృతుడి తల్లి వెంకటేశ్వరమ్మ రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు హత్యకేసు నమోదు చేసిన దర్యాప్తు జరుపుతున్నామని సీఐ గాంధీ నాయక్ తెలిపారు. సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితులందరిపైనా చర్యలు తీసుకుంటామన్నారు.

# జనరల్ ఆస్పత్రిలో కంపుకొడుతున్న మరుగుదొడ్లు

- మూత్ర పరీక్షలకు ఇబ్బందులు పడుతున్న రోగులు
- తలుపులు, గొళ్లాలు లేక మహిళ ఇక్కట్లు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మే 14: పేరుకు మాత్రం అది జనరల్ ఆసుపత్రి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఈ ఆసుపత్రికి రోగులు వస్తుంటారు. ప్రతీరోజు వందల సంఖ్యలో ఓపీ ఉంటుంది. కాని ఓపీ రోగులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ముఖ్యంగా మరుగుదొడ్ల వ్యవస్థ అధ్వానంగా ఉంది. మూత్రపరీక్షల కోసం మూత్రం తీసుకోవడానికి ఎక్కడికి వెళ్లాలిరా.. దేవుడా అని రోగులు నానా అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లకు గొళ్లాలు, తలుపులు లేకపోవడంతో మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

### అధ్వానంగా మరుగుదొడ్ల వ్యవస్థ...:

జనరల్ ఆసుపత్రిలోని ఓపీ విభాగంలో మరుగుదొడ్ల వ్యవస్థ అధ్వానంగా మారింది. తరుచూ డ్రైనేజీ పైప్‌లైన్లు దెబ్బతింటుండడంతో మురుగునీరంతా బయటకు పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. జనరల్ విభాగానికి సంబంధించి కొన్ని మరుగుదొడ్లు ఉండగా అవి పనిచేయడం లేదు. లోపల ఉన్న కుండీలు మలమూత్రాలతో నిండుకున్నాయి. కనీసం శుభ్రం కూడా చేయడం లేదు. అదే విధంగా సెంట్రల్ ల్యాబ్ విభాగానికి సంబంధించి మరో మరుగుదొడ్లు ఉన్నాయి. అవి కూడా అధ్వానంగా ఉన్నాయి. తలుపులు విరిగిపోయి, గొళ్లాలు ఊడిపోయి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లాలంటేనే రోగులు జంకుతున్నారు. ఈ రెండు విభాగాలకు సంబంధించి ఒక్కటే పైప్‌లైన్ వ్యవస్థ ఉంది. కానీ అది గత కొన్ని నెలలుగా తరచూ పైపులు పగిలిపోతున్నాయి. వాటిని పట్టించుకోవడం లేదు. ఆసుపత్రికి వచ్చిన దాదాపు 60 శాతం మంది రోగులకు మూత్రపరీక్షలు రాస్తున్నారు. అయితే మూత్రపరీక్షల కోసం సెంట్రల్ ల్యాబ్‌కు వెళ్లిన రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్న మూత్రశాలలు అధ్వానంగా ఉండడంతో పాటు తలుపులు పగిలిపోయి, గొళ్లాలు ఊడిపోయి ఉండడంతో మూత్రం తీసుకోవడానికి అందులోకి వెళ్లలేకపోతున్నారు. ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా జనరల్ ఓపి విభాగానికి వచ్చిన వారు సైతం మూత్రశాలలకు వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. మూత్రశాలలు కంపుకొడుతున్నా పట్టించుకోవడం లేదు. ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్ సిబ్బంది ఆ వైపునకే వెళ్లడం లేదు. దీంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు మలమూత్రాలతో నిండుకొని కంపుకొడుతున్నాయి. వాష్ బెసిన్‌లు, కండీలు అధ్వాన్నంగా తయారయ్యాయి.


జనరల్ ఆస్పత్రిలో మరుగుదొడ్ల దుస్థితి


పారవేసిన డ్రైనేజీ మట్టి

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్, మే 14 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి మంగళవార తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని రంగారెడ్డిపల్లి వాగునుంచి సోమవారం తెల్లవారు జామున మండల పరిధి లోని జక్కుల పల్లికి ఇసుక తరలిస్తున్న రిజిస్ట్రేషన్ నెంబర్ లేని ట్రాక్టర్ ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## తప్పిపోయిన యువతి

తెలకపల్లి, మే 14 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం చిన్న ముద్దునూర్ గ్రామానికి చెందిన పాశం మల్లీశ్వరి(26) అదృశ్యం అయింది. జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూ ఉండేది. ఈ నెల మే 1న ఉదయం తన అక్క దగ్గరికి హైదరాబాద్ వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తన ఫోన్ కూడా స్విచ్చాఫ్‌గా ఉందని తన అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## ఓటు వేయించేందుకు వచ్చి..

మిడ్జిల్, మే 14 : ఓటు వేయించేందుకని తన భార్యను అత్తారింటికి తీసుకొచ్చిన భర్త, అదృశ్యమైన సంఘటన ఇది. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం దోనూరు గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మహబూబ్ నగర్ మునిసిపల్ పరిధిలోని క్రిస్టియన్ పల్లి కాలనీకి చెందిన నవీన్‌కుమార్‌కు, మిడ్జిల్ మండలం దోనూరు గ్రామానికి చెందిన ప్రవళిక భార్యాభర్తలు. ప్రవళికకు అత్తారింటి కాలనీలో ఓటు హక్కు లేదు. ఆమెకు ఆమె పుట్టిన ఊరు దోనూరులో ఉంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఓటు వేయించేందుకని ప్రవళికను నవీన్‌కుఆర్ దోనూరుకు తీసుకెళ్లాడు. ఆమెకు ఇంటి వద్ద దించాక, అలా బయటికి వెళ్లిన అతను ఎంతకూ ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల వెతికారు. మంగళవారం ప్రవళిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదృశ్యమైన నవీన్‌కుమార్ గురించి ఎవరికైనా ఆచూకీ లభిస్తే తమకు సమాచారం అందజేయాలని ఎస్ఐ తెలిపారు.

## రైల్వే ట్రాక్ దాటుతూ గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

మిడ్జిల్, మే 14 : జడ్చర్ల పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు సోమవారం రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ప్రమాదానికి గురైనట్లు మహబూబ్‌నగర్ రైల్వే ఎస్ఐ సయ్యాద్ అక్బర్ మంగళవారం తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆ వృద్ధురాలిని 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా గుర్తు పడితే తమకు సచారం ఇవ్వాలని కోరారు.

## వ్యవసాయ బావుల విద్యుత్ వైర్లు చోరీ

**- ఆందోళన చెందుతున్నరైతులు**



బోరు మోటారు విద్యుత్ వైరును కట్ చేసినట్లు చూయిస్తున్న రైతు

భూత్పూర్, మే 14: వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ కేబుళ్ల వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతుల కథనం ప్రకారం.. మండలంలోని శేరిపల్లి (హెచ్), హస్నాపూర్ గ్రామాల శివారుల్లో దాదాపు 30మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్లకు అమర్చిన విద్యుత్ కేబుళ్లను ఈ నెల 11న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్టాటర్ నుంచి మోటారుకు వెళ్లే విద్యుత్ కెబుళ్లను దొంగలు తీసుకెళ్లారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాగే జరిగిందని ఇప్పుడూ ఇలాగే చోటు చేసుకోవడంతో ఆందోళన చెందుతున్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మహేష్

మక్తల్, మే 14 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గద్వాల జిల్లా ధరూర్ మండలం చింతరేవుల గ్రామానికి చెందిన మహేష్‌గౌడ్(40) 12ఏళ్ల నుంచి మక్తల్‌లో నివాసం ఉంటూ టీవీఎస్ బైక్ షోరూం నిర్వహిస్తున్నాడు. ఇంటి నిర్మాణంలో భాగంగా క్యూరింగ్ చేసేందుకు బోర్ ఆన్‌చేసి చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న తాపీ మేస్త్రీలు విద్యుత్ ఆఫ్‌చేసి వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహేష్‌గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం ఉదయం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న మహేష్‌గౌడ్ మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## ఆటో ఢీకొని బాలుడి మృతి

కోస్గిరూరల్, మే 14: ఆటో ఢీకొని బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని ఈజీపూర్ గ్రామశివారులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు హన్వాడ మండలం సల్లోనిపల్లికి చెందిన ఆటో పోలేపల్లికి వెళ్తోంది. ఈ క్రమంలో ఈజీపూర్ గ్రామం గేటువద్ద రోడ్డు దాటుతున్న అభిరామ్ (7)ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడిది ఫారుక్‌నగర్ మండలం హాజిపల్లి కాగా వేసవి సెలవుల నిమిత్తం అమ్మమ్మ ఊరైన ఈజీపూర్‌కు వచ్చాడు. బాలుడి తండ్రి సందీప్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ తిరుపతయ్యపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌గౌడ్ తెలిపారు.

## నిప్పంటుకొని కాలిపోయిన ప్రకృతి వనం



కాలిపోయిన చెట్లు

వీపనగండ్లమే14: వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని కల్వాల్ ప్రకృతి వనానికి మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో చెట్లు, వైర్లు కాలిపోయాయి. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ప్రకృతి వనంలో మంటలు చెలరేగాయి. దీంతో పూలమొక్కలు, కొబ్బరి చెట్లు, వివిధ రకాల చెట్లు కాలిపోయాయి. బోరు మోటారు వైర్లు కాలిపోయినట్లు పంచాయతీ కార్యదర్శి కురుమయ్య తెలిపారు. నిప్పంటుకున్న విషయం గమనించి గ్రామస్థులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. పాక్షికంగా కాలిన మొక్కలు బతికే అవకాశం ఉందని కార్యదర్శి తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఉస్మాన్ బాష

రాజోలి, మే 14 : మండల కేంద్రమైన రాజోలికి చెందిన ఉస్మాన్ బాష (26) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉస్మాన్ బాష చేనేత వృత్తి చేసుకుంటూ జీవించేవాడు. తాగుడుకు బానిస కావడంతో పెళ్లి కాలేదు. తనకు ఎవరూ పిల్లను ఇవ్వడం లేదని తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 10న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి మేనమామ మాబు బాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇరువర్గాలపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి, మే 14 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని చిన్నకార్పాములు గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగిన సంఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నకార్పాముల గ్రామంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఘర్షణ పడి దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో ఆ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు విజయ్ ఫిర్యాదు మేరకు బుడుగు శ్రీనివాసులు, అతని అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు రాకేష్ ఫిర్యాదు మేరకు విజయ్ అతడి అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

## డీ-6 కాలువకు మరమ్మతులు చేపట్టాలి



గుంటిపల్లి వద్ద ధ్వంసమైన డీ6 కాలువ

ఆత్మకూరు,మే14: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న డీ6 కాలువకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. డీ 6 కాలువ ఆయకట్టు పరిధిలో జూరాల, గుంటిపల్లి, ఆరేపల్లి, కత్తెపల్లి, తూంపల్లి, వీర రాఘవపూర్, రేచింతల గ్రామాలను కలుపుకొని 12వేల ఎకరాలు సాగునీటిని సద్వినియోగం చేసుకుని రైతులు పంటలను సాగు చేస్తున్నారు. గత దశాబ్దం క్రితం నుంచి కాలువకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రంధ్రాలు ఏర్పడి మధ్యలోనే సాగునీరు కుంటల కృష్ణానదికి వృథాగా చేరుతుంది. దీని ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందక పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయని కారణంగా మరమ్మతులు చేపట్టేందుకు మరో రెండు నెలల పాటు అవకాశం ఉంది. ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి 12 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న డీ6 కాలువకు మరమ్మతులు చేపడితే ఖరీఫ్ సీజన్‌లోనైనా సాగునీటిని సద్వినియోగం చేసుకుని పంటలు పండించే అవకాశం ఉందని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

# తల్లడిల్లుతున్న.. కన్నపేగు

**- గద్వాల జిల్లాలో కొనసాగుతున్న శిశు మరణాలు**

**- సరైన సమయంలో స్పందించని వైద్యులు**

**- నాయకుల అండదండతో ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి**

గద్వాల క్రైం, మే 14 : జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో శిశు మరణాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. తొమ్మిది నెలలు కడుపులో పెరిగిన ఆ శిశువు బయటకు వస్తుందని ఎంతో ఆశతో గర్భిణులు ఎదురు చూస్తారు. కాగా గర్భంలోనే కొందరు, పుట్టిన క్షణాలకే మరికొందరు శిశువులు మృతి చెందుతుండటంతో కన్నపేగు తల్లడిల్లుతోంది. శిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులు తరుచూ ఆదేశిస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. అధికంగా అవగాహన లోపంతో గ్రామాల్లో శిశుమరణాలు సంభవిస్తున్నాయి. మరికొంత మంది వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందుతున్నారనే విమర్శలు ఉన్నాయి.



గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

### ఇటీవలే రెండు శిశు మరణాలు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇటీవలే ఇద్దరు శిశుశులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇది అధికారికంగా మాత్రమే. అనాధికారికంగా మరికొన్ని శిశు మరణాలు సంభవించినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 6న గట్టు మండలం బోయలగూడెంకు చెందిన సుజాత అనే గర్భిణి కాన్పుకు రాగా వైద్యులు సకాలంలో స్పందించకపోవడంతో కడుపులోనే మగశిశువు మృత్యువాత పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో నిరసన చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గత నెల 27న గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని ర్యాలంపాడు గ్రామానికి చెందిన గీతకు మొదటికాన్పుకు పండంటి ఆశతో ప్రవేట్ ఆసుపత్రికి రాగా వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు కడుపులోనే మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. వీటితో పాటు జిల్లాలోని ప్రభుత్వ, ప్రవేట్ ఆసుపత్రుల్లో మరికొన్ని శిశు మరణాలు సంభవించినట్లు తెలుస్తుంది. అయితే, ఇవి బయటకు రాకుండా ఆసుపత్రి వర్గాలు జిల్లా వైద్య శాఖలో ఓ అధికారికి మామూళ్లు ముట్టజెప్పినట్లు తెలుస్తుంది. అలాగే రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఆసుపత్రుల సిబ్బందికి మెండుగా ఉండటమేనని పలువురు ఆరోపిస్తున్నారు. దానితోనే శిశు మరణాలపై జిల్లా వైద్యాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి.



ఇటీవలే మృతి చెందిన శిశువు(ఫైల్)

### విచారణను గోప్యంగా ఉంచిన వైద్యసిబ్బంది

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవలే మృతిచెందిన శిశు మరణంపై బాధితుల ఫిర్యాదు మేరకు రాష్ట్ర వైద్యాధికారుల టీం ఈ నెల 10 జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విచారణ చేపట్టింది. అయితే ఈ విషయాన్ని సంబంధిత వైద్యాధికారులు గోప్యంగా ఉంచారు. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిన ఉండటంతోనే విచారణను గోప్యంగా ఉంచినట్లు సమాచారం. జిల్లా వైద్యాధికారులు జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులలో తనిఖీలు చేయకపోవడంతో శిశుమరణాలు సంభవిస్తునట్లు తెలుస్తుంది.

### చర్యలు తీసుకుంటాం



ఇటీవలే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతిపై రాష్ట్ర వైద్యాధికారులు విచారణ చేసింది వాస్తవమే. అయితే అందుకు సంబంధించిన వివరాలను మీడియాకు అందజేయాలని చెప్పినా కూడా ఆసుపత్రి వర్గాలు గోప్యంగా ఉంచారు. త్వరలోనే అన్ని విషయాలు వెల్లడిస్తాం. జిల్లాలో మాతా, శిశు మరణాలు సంబవించకుండా చర్యలు తీసుకుంటాం.

**- డాక్టర్ శశికళ, డీఎంహెచ్‌వో, గద్వాల**

## స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

పాలమూరు యూనివర్సిటీ, మే14: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కొడంగల్, నారాయణపేట, మక్తల్, షాద్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల, మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరచారు. మంగళవారం ఉదయం వరకు పాలమూరు యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలను భద్రపరిచారు. ఎన్నికల పరిశీలకులు షెంవాంగ్ గ్యాచో భూటియా, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ ఎస్పీ హర్షవర్ధన్ సమక్షంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆధ్వర్యంలో రూమ్‌లకు సీల్ వేశారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద కేంద్ర బలగాల, పోలీసుల ఆధ్వర్యంలో మూడంచెల పద్ధతిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రాజకీయా పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన,సీల్ వేస్తున్న ఎన్నికల సంఘం పరిశీలకులు షెంవాంగ్ గ్యాచో భూటియా, కలెక్టర్ రవినాయక్, అధికారులు

# చదువుతో పాటు ఆటపాటలు ముఖ్యం

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 14 : విద్యార్థులు చదువుతోపాటు వ్యాయామం, ఆటపాటలు కూడా ఎంతో ముఖ్యమని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యార్థులతో కలిసి వివిధ ఆటల్లో పాల్గొని విద్యార్థులను ఉత్సాహ పరిచారు. ముందుగా విద్యార్థులతో కలిసి వ్యాయామం చేశారు. టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ గేమ్స్ ఆడుతున్న విద్యార్థులతో కలిసి మమేకమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. త్వరలో పెండింగ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్ పనులను పూర్తి చేయిస్తానన్నారు. రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం ఎంత ముఖ్యమో ప్రతీ మనిషికి వ్యాయామం అంత ముఖ్యమన్నారు. వ్యాయామం చేయడం వల్ల మన మెదడు చురుకుగా ఉంటుందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంపునకు ఇంతమంది చిన్నారులు రావడం సంతోషమని మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, ట్రైనర్స్ మగ్బూల్, నాగరాజు, ఉమాపతి, రవి, సురేష్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్‌సీ ఫలితాల్లో ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**- వనపర్తి జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యార్థి**

ఆత్మకూరు,మే 14: సీబీఎస్‌సీ పదవ తరగతి ఫలితాల్లో వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రానికి చెందిన ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 97 శాతం మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. ఉమ్మడి జిల్లాలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక పాఠశాల అని ఎంవీ రామన్ కరస్పాండెంట్ మొగిలి శ్రీధర్ గౌడ్ తెలిపారు. జిల్లా టాపర్‌గా నిలిచిన ఎస్ శ్లోకాను కరస్పాండెంట్ మొగిలి శ్రీధర్ గౌడ్, ప్రిన్సిపాల్ హ్యాప్సీ శ్రీధర్ అభినందించారు. అలాగే ప్రతీ ఏడు ప్రకటించిన ఫలితాలలో ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థులు జిల్లాలోనే టాపర్‌గా నిలిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. అందుకుగాను పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంవీ రామన్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

# ఆటో బోల్తా మహిళ దుర్మరణం

**- 13 మంది మహిళలకు గాయాలు**

**- మిరప పండు తెంచి వస్తుండగా ఘటన**

**- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు**



బోల్తా పడిన ఆటో, మృతి చెందిన వెంకటమ్మ మృతదేహం

చారకొండ, మే 14: అదుపు తప్పి ఆటో బోల్తా పడి ఓ మహిళ మృతి చెందగా, 13 మంది మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం శిర్సనగండ్ల సమీపంలోని మూలమలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా డిండి మండలం రుద్రాయిగుడెం గ్రామానికి చెందిన 14 మంది మహిళా కూలీలు రోజు మాదిరి అదే గ్రామానికి చెందిన చందు ఆటోలో మిరప పండు తెంచేందుకు వెళ్లారు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా మధ్యాహ్నం 1:30 గంటలకు శిర్సనగండ్ల సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న ఆరేకంటి వెంకటమ్మ (54) తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు 108కు ఫోన్ చేయడంతో సంఘటన స్థలానికి వచ్చిన అంబులెన్సులో తీవ్రగాయాలైన ముగ్గురిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా పదిమంది మహిళలకు గాయాలు కావడంతో చారకొండలోని ఓ ప్రథమ చికిత్సలయానికి తరలించారు. మృతి చెందిన వెంకటమ్మకు భర్త కృష్ణయ్య (దివ్యాంగుడు), ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతురాలి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ చందుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రైతుకు పోలీస్ సాయం

పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతు నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువచ్చారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోవడం వర్షం పడే సూచనలుండటంతో రైతు ధాన్యం కుప్పగా పోసేందుకు ఆరాటపడుతుండగా అక్కడే స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ముగ్గురు పోలీసులు రైతు బాధను చూసి చలించారు. వెంటనే అక్కడికి చేరుకుని ధాన్యం కుప్పగా పోసేందుకు రైతుకు సాయం చేశారు. కుప్పపోసి కవర్ కప్పారు. పోలీసులు యూనిఫాం వేసుకుని రైతుకు చేసిన సాయంపై అక్కడున్నవారంతా పోలీసుల తీరుపై ప్రశంసలు కురిపించారు.

**- ఆంధ్రజ్యోతి ఫొటోజర్నలిస్ట్, మహబూబ్‌నగర్**



## చిరుత దాడిలో ఆవుదూడ మృతి

కోయిలకొండ మే 14 : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని నల్లవెల్లి సమీపంలో కావలి రాఘవులు చెందిన ఆవుదూడపై చిరుత దాడి చేసిందని అటవీశాఖ అధికారి నరేందర్ తెలిపారు. సోమవారం రాత్రి రాఘవులు పొలం దగ్గర ఉన్న పశువుల పాకలో ఉన్న ఆవు దూడపై చిరుత దాడి చేసి సమీపంలోని గుట్టలపైకి ఈడ్చుకెళ్లిందని తెలిపారు. నీళ్ల కోసం అడవుల్లో నుంచి చిరుతలు బయటికి వస్తున్నాయని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిరుత దాడిలో మృతి చెందిన రాఘవులు ఆవుదూడకు నష్టపరిహారం అందిస్తామని వెల్లడించారు.

## గంగమ్మ ఆలయంలో చోరీ

రాజోలి, మే 14 : గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రం తుంగభద్ర నది సమీపంలో కొలువుదీరిన శ్రీ గంగాభవాని ఆలయంలో చోరీ జరిగినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం ఆలయంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసిన అనంతరం అర్చకులు వినోద్ కుమార్ ఆలయానికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. సాయంత్రం ఆలయంలో పూజలు చేసేందుకు అర్చకుడు వినోద్ కుమార్ రాగా ఆలయ తలుపులకు, గేటుకు వేసిన తాళాలు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. గర్భగుడిలో ఉన్న గంగమ్మ తల్లి విగ్రహంపై ఉన్న వెండి కన్నులు, నామాలు, ఎత్తుకెళ్లారు. హుండీని ధ్వంసం చేసి నగదును సైతం ఎత్తికెళ్లారని ఆలయ కమిటీ అధ్యక్షుడు రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా కొత్త రాజోలిలోని రాములవారి ఆలయంలో కూడా మంగళవారం ఉదయం అమ్మవారి విగ్రహంపై ఉన్న బంగారపు తాళిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధరూరు, మే 14 : గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో మతిస్థిమితం లేని వ్యక్తి భిక్షాటన చేసు కుంటూ మంగళవారం మృతి చెందారని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. సదరు వ్యక్తి గత రెండు, మూడు సంవత్సరాలుగా మండల కేంద్రంలో తిరుగుతూ భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవారన్నారు. మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

గద్వాల క్రైం, మే 14 : గద్వాల పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన మహమ్మద్ మౌలాలి(26) అనే యువకుడు మంగళవారం మధ్యాహ్నం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహమ్మద్ మౌలాలి అనే వ్యక్తి కారా బండి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గత 10 సంవత్సరాల క్రితం మౌలాలి తల్లి మృతిచెందగా అప్పటినుండి మానసికంగా కృంగిపోయి మద్యానికి అలవాటు పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య మహబూబ్‌బీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వేహెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

## మహిళ అదృశ్యం - కేసు నమోదు

ఉప్పునుంతల, మే14: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో మంగళవారం మహిళ అదృశ్యమైంది. ఏఎస్సై సుజ్ఞానం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడ్ల రజిత సోమవారం ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. రజిత భర్త ఎడ్ల రామస్వామి ఇంటి చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. రామస్వామి అత్తగారి గ్రామమైన వంగూర్ మండల పరిధిలోని కోనేటిపూర్ గ్రామానికి భార్య రజిత తమ్ముడు గడ్డం నాగయ్యకు విషయం తెలియజేశాడు. నాగయ్య మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ ట్రాలీ దగ్ధం

గోపాల్ పేట, మే 14: విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైంది. ఈ ఘటన వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం ఏదుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏదుట్ల గ్రామానికి చెందిన దూడల శేషి తన పశువుల కోసమని పొలం దగ్గర నుంచి ట్రాక్టర్‌లో వరిగడ్డిని తరలిస్తుండగా పక్క పొలానికి సంబంధించిన విద్యుత్ తీగలు కిందికి ఉండటంతో డ్రైవర్ తీగలను నెమ్మదిగా తప్పించాడు. కానీ, ఒక తీగకు మరో తీగ తగలడంతో నిప్పు రవ్వలు వచ్చి గడ్డిపై పడ్డాయి. దాంతో గడ్డి అగ్నికి ఆహుతైంది. అక్కడే ఉన్న రైతులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ చేరుకునేలోగా గడ్డి పూర్తిగా దగ్ధమైంది. వెంటనే యజమాని రైతుల సాయంతో ట్రాక్టర్ ఇంజన్‌ను పక్కకు తప్పించారు. దాంతో ట్రాలీ దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

## గోప్లాపూర్‌లో కోటమైసమ్మ బోనాలు



కోటమైసమ్మకు బోనాలు సమర్పించడానికి వెళ్తున్న మహిళలు

భూత్పూర్, మే 14 : మునిసిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్ గ్రామంలో మంగళవారం కోటమైసమ్మ బోనాల ఉత్సవాలను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో వేపాకు తోరణాలు కట్టి అలంకరించారు. సాయంత్రం గ్రామ శివారులో ఉన్న కోటమైసమ్మ దేవతకు మహిళలు బోనాలతో నైవేద్యం సమర్పించారు. అంతకు ముందు కోటమైసమ్మ దేవాలయంలో గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ రెండేళ్లకు ఒక సారి కోటమైసమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఛైర్మన్ బస్వరాజుగౌడ్, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మేకల సత్యనారాయణ, గౌరయ్య, రాములు గ్రామస్థులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## అల్లీపురంలో పెద్దమ్మ బోనాలు



అల్లీపురంలో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

చిన్నచింతకుంట, మే 14 : మండలంలోని అల్లీపురం గ్రామంలో మంగళవారం పెద్దమ్మ అమ్మవారికి బోనాల ఉత్సవం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పెద్దమ్మతల్లి గుడి దగ్గరకు ఊరేగింపుగా చేరుకొని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, తమ మొక్కులను తీర్చుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పిండివంటలు, బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది.

## పిడమర్తి రవి జన్మదిన వేడుక



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాదిగ జేఏసీ నాయకులు

పాలమూరు, మే 14 : తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషించిన పిడమర్తి రవి పుట్టినరోజు వేడుకలను మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన పిడమర్తి రవి సేవలు సమాజానికి అవసరమన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్, మెట్టు యాదన్న, రామలింగం, కె.కృష్ణకుమార్, అరుణ్, వెంకట్రాములు, పులిజాల విజయ్, బుద్దారం శాంతయ్య, మచ్చనపల్లి నరసింహ, చెన్నకేశవులు, నరేందర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## డ్రైవర్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

పాలమూరు, మే 14 : మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ అకారణంగా మరణించిన డ్రైవర్ సూర్యప్రకాష్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రావటం సంతోషంగా ఉందని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాను అందజేశారు. గద్వాల జిల్లాలోని మెడికల్ విభాగంలో పనిచేస్తున్న డ్రైవర్ సూర్య ప్రకాష్ మరణంతో ఆయన కుటుంబానికి రావాలిసిన పీఎఫ్, ఏరియర్స్ నష్టపరిహారం డబ్బు రూ.ఐదు లక్షల 78వేలు ప్రభుత్వం నుంచి ఇప్పించటం సంతోషంగా ఉందని డ్రైవర్ భార్య సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెడికల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రాజు, సీఐటీయూ నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, కిల్లె గోపాల్, కె.రమేష్, రజాక్, శేఖర్, వరద గాలెన్న పాల్గొన్నారు.

## నారాయణ్‌ఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి

**- ఉపాధ్యాయ సంఘాల నాయకుల డిమాండ్**

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ మిడ్జిల్, మే 14 : ఎన్నికల విధులు నిర్వహించినందుకు రెమ్యునరేషన్ తక్కువగా ఇచ్చారని అడిగితే ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జీ చేయించిన నారాయణ్‌ఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారికి రోజుకు రూ.600, ఓపీవోకు రోజుకు రూ.400 ఇవ్వాలని ప్రభుత్వం జీవో 61ని ఈనెల 11 విడుదల చేసిందని గుర్తు చేశారు. ఆ ప్రకారం ఉపాధాయులకు ఇవ్వాలని అడిగిన అక్కడి ఆర్డీవో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్మారెడ్డి, పలువురు ఉపాధ్యాయులపై పోలీసుల చేత లాఠీచార్జీ చేయించడం తగదన్నారు. ఎన్నికల విధులు నిర్వహించిన టీచర్లపై దాడి చేయించిన, ఆర్డీవో, లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

● ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యునరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. నర్సిములు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని నర్సిములు విలేకరులతో మాట్లాడారు. దౌర్జన్యం చేసిన పోలీసులపై, చేయించిన ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటయ్య, రమేష్ ఉన్నారు.

**డీటీఎఫ్ నాయకుల ఖండన**

ఎన్నికల విధులు నిర్వహించిన వారికి రెమ్యునరేషన్ తక్కువగా ఇచ్చారని అడిగిన ఉపాధ్యాయులపై నారాయణఖేడ్ ఆర్డీవో పోలీసులతో లాఠీచార్జీ చేయించడాన్ని పలువురు డీటీఎఫ్ నాయకులు ఖండించారు. ఈ మేరకు సంబంధిత ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.వామన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల విధులు నిర్వహించిన టీచర్లకు ఎన్నికల కమిషన్ ఇచ్చేవిధంగా రెమ్యునరేషన్ ఇవ్వకుండా తగ్గించి ఇవ్వడం ఏంటని అడిగితే ఉపాధ్యాయులపై అధికారులపై పోలీసులతో లాఠీచార్జీ చేయించడం మంచిదికాదన్నారు. ఆర్డీవోపై, లాఠీచార్జీ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జడ్పీటీసీని పరామర్శించిన తాండూర్ ఎమ్మెల్యే



జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి

గండీడ్, మే 14 : జడ్పీటీసీ సభ్యుని శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి బుచ్చమ్మ వారం క్రితం మృతి చెందగా మంగళవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంగళవారం మండల పరిధిలోని కొంరెడ్డిపల్లికి చేరుకొని జడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచు గోపాల్, జంగళ్ల వెంకటయ్య, భీమయ్య, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లు ఈ కష్టాలు

**- అసంపూర్తిగా కోయిల్‌సాగర్ కాల్వ**

**- జమ్మి మొలిచి, తూము పగిలి**

**- అస్థవ్యస్థంగా సాగునీటి కుడి కాలువ**

దేవరకద్ర, మే 14 : పాలకుల, అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి పంటలకు సాగునీరు అందించేందుకు దాదాపు 14 ఏళ్ల క్రితం మొదలు పెట్టిన ఎడమకాల్వ పొడిగింపు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. దీంతో వర్షాలు కురిసినప్పుడు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాల్వ నుంచి విడతల వారీగా పంటలకు నీటిని వదిలినప్పుడు ముందుకు వెళ్లే మార్గం లేక రైతులు పంట పొలాల్లోకి చేరుతున్నాయి. దీంతో వందల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులకు త్రీవ నష్టం జరుగుతుంటుంది.



పెద్దరాజమూర్ సమీపాన కోయిల్‌సాగర్ కుడి కాల్వలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు

**ఏళ్లుగా వెంటాడుతున్న సమస్య**

ప్రాజెక్టు ఎడమ కాల్వ పొడిగింపు ద్వారా వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పనులను చేపట్టారు. భూసేకరణ అనంతరం ప్రాజెక్టు నీటిని కాల్వల ద్వారా గుడిబండ, గోపన్‌పల్లి, పుట్టపల్లి, రాజోలి, కౌకుంట్ల, దాసరిపల్లి మీదుగా తీసుకెళ్లి చిన్నచింతకుంట మండలంలోని తిర్మలాపూర్ చెరువుకు కలపాలని ప్రణాళిక రూపొందించారు. వివిధ కారణాలతో పనులను రాజోళి గ్రామం దగ్గర నిలిపివేశారు.

**మరమ్మతులకు నోచుకోని కుడికాల్వ**

చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట, బండ్రవల్లి, పల్లమరి, నెల్లికొండి, సాగునీరు అందించేందుకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి కాల్వ మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదు కిలో మీటర్ల పొడవున కాల్వకు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఫీడర్‌చానల్, తూములు ధ్వంసమయ్యాయి. దీంతో ఏటా ప్రాజెక్టు నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తే, ఆ నీరంతా వృథాగా పోతుంటుంది. చివరి ఆయకట్టుకు అందడం లేదు. దీంతో ఐదు వేల ఎకరాలు బీడుగా మారే అవకాశం ఉంది. కొందరు రైతులు బోరు బావులు కింద పంటలు సాగు చేసినా చివరి వరకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి.



బస్వాపూర్ దగ్గర ధ్వంసమైన తూములు

**కుడి, ఎడమ కాల్వల పరిధిలో 12 వేల ఎకరాలకు నీరు**

ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా ఏటా అధికారులు 12 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కుడికాల్వ, చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఐబీ శాఖ నుంచి మేజర్ ఇరిగేషన్ శాఖలో కలిసిన తర్వాత అధికారులు నీటి విడుదలకు జాప్యం వహిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకొని కుడికాల్వ మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

**పంట ఎండుతుంది**

ప్రతీ సంవత్సరం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీరు వస్తుందని కాల్వ కింద ఉన్న పొలంలో పంట సాగు చేస్తున్నాను. కానీ, నీరు రాక పంట చేతికి వచ్చే సమయంలో ఎండిపోతోంది. పంటకు తెచ్చిన పెట్టుబడి తీర్చలేకపో తున్నాం. అధికారులు ఈ సంవత్సరమైనా పంట సాగుకు నీరు అందించాలి.

- రైతు నర్సింములు

**మరమ్మతులు చేపడుతాం**

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద ఉన్న కుడికాల్వ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఈ కాల్వ కింద నిర్దేశించిన ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు. నిధుల కొరత వల్ల మరమ్మతులు చేయలేదు. ప్రభుత్వానికి నివేదించి, నిధులు రాగానే పనులను వెంటనే ప్రారంభించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం.

- ప్రతాప్‌సింగ్, ప్రాజెక్టు అధికారి

## దీక్ష, సహనానికి ప్రతిరూపం భగీరథ మహర్షి

**- జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన నాయకులు**

పాలమూరు, మే 14 : భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్టు ఏరియాలోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలనే భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించటం ప్రారంభించినట్లు తెలిపారు. మునిసిపల్ ఛైర్మన్ కె.ఆనంద్ కుమార్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో వెళ్లి జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్టు ఏరియాలో గల భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో సగర భగీరథ మహర్షి చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ భగీరథ మహర్షి మహాజ్ఞానిగా అభివర్ణించారు. పరోపకారానికి పెట్టింది పేరు అని, దీక్ష, సహనానికి ప్రతిరూపం అని, ఎంత కష్టాన్నయినా లెక్కచేయకుండా అనుకున్నది సాధించాడు భగీరథ మహర్షి అని అన్నారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ సవారి సత్యం, శేఖర్, జాంగ్ర సంఘం నాయకులు మహేందర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, రజక నాయకులు నడమింటి శ్రీనివాసులు, కుమ్మరి సంఘం అధ్యక్షుడు బుగ్గన్న, ముదిరాజ్ నాయకులు గంజి ఆంజనేయులు, శివన్న, సుక్కలి భాస్కర్, మల్లేష్, కోళ్ల రాజు, ఆంజనేయులు, మహేందర్ పాల్గొన్నారు.





భగీరథ మహర్షి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



భగీరథ మహర్షి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మునిసిపల్ ఛైర్మన్ కె.ఆనంద్‌కుమార్‌గౌడ్





భగీరథ మహర్షికి నివాళి అర్పిస్తున్న బీసీ సమాజ్ నాయకులు

## చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి డి.ఇందిరాదేవి**

పాలమూరు, మే 14 : పారా లీగల్ వలంటీర్లు, లీగల్ ఎయిడ్ న్యాయవాదుల సహకారంతో వారి ప్రాంతాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి డి.ఇందిరాదేవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పారా లీగల్ వలంటీర్స్, ప్యానల్ అడ్వకేట్‌లకు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వారికి సెన్సిటైజేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఛైర్మన్ కమ్ జిల్లా న్యాయాధికారి ఆదేశానుసారం ఇన్‌చార్జి జిల్లా కార్యదర్శి సెన్సిటైజేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ న్యాయ సేవా సదన్ ద్వారా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన కార్యక్రమాలు, వాటి ప్రణాళికను చేపట్టాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న చట్టాల గురించి తెలియజెప్పేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్యానల్ అడ్వకేట్స్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులతో వారి పనితీరు, లీగల్ ఎయిడ్ కేసుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పుట్టపాగ రఘుపతి, యోగేశ్వర్‌యాదవ్, మల్లారెడ్డి, రాజేష్, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్స్ సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి డి.ఇందిరాదేవి

## సీబీఎస్ఈ ఫలితాల్లో కేంద్రియ విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 14 : జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో గల కేంద్రియ విద్యాలయం విద్యార్థులు సోమవారం విడుదలైన సీబీఎస్‌సీ పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. విద్యాలయానికి చెందిన పదవ తరగత ఫలితాల్లో శివకార్తీక్ 500 మార్కులకు గాను 485 మార్కులు, అలివేరి కీర్తి 478, పదో తరగతిలో ఎ-1 34 మంది, ఏ-2 53 మంది, బి-1 67 మంది, బి-2 59 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 12వ తరగతిలో సీబీఎస్ఈ బోర్డు ఫలితాల్లో 500 మార్కులకు గాను 455 మార్కులు సాధించారు. 17 మంది విద్యార్థులకు గాను 17 మంది ఉతీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

● నేటినుంచి 11 వతరగతి అడ్మిషన్స్ : జిల్లా కేంద్రంలోని కేంద్రియ విద్యాలయంలో 11వ తరగతి ప్రవేశాల కోసం బుధవారం నుంచి అడ్మిషన్స్ ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ వై.సురేందర్ తెలిపారు. పదో తరగతి పాస్ అయి విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించి 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదిలో మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందని తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**పేరుకే సొంత భవనం..**

## సౌకర్యాల్లేక అయోమయం

**- కేజీబీవీలో సౌకర్యాలు కరువు**

**- ఒక అంతస్తులోనే అరకొర వసతులు**

**- మిగతా రెండు అంతస్తుల్లో సౌకర్యాలు మృగ్యం**

రాజాపూర్, మే 14 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నూతన భవనంలో వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎనిమిదేళ్ల నుంచి మండలంలో అద్దెభవనంలో కేజీబీవీ కొనసాగుతుండగా, రెండేళ్ల క్రితం సొంత భవనం నిర్మించారు. అద్దె భవనం ఉన్నప్పుడు అరకొర సమస్యల నడుమ కాలం వెళ్లదీసిన విద్యార్థులు, సొంత భవనం నిర్మించినప్పటికీ అందులో కనీస వసతులు కల్పించకపోవడంతో అవే సమస్యలతో అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు భవనాన్ని తూతూ మంత్రంగా, అసంపూర్తిగా నిర్మించడంతో పైన పటారం లోన లొటారం అంటే ఇదేనేమో అనే విధంగా అక్కడి పరిస్థితులు ఉన్నాయి. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించకుండా భవనంలోకి విద్యార్థులను పంపించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు అంతస్థుల భవనాన్ని కింద ఒక అంతస్థు మాత్రమే పూర్తి స్థాయిలో పనులు చేసి విద్యార్థులను ఉంచడంతో అక్కడ విద్యార్థులు చదువు కోసం తరగతి గదులుగా ఉపయోగించు కుంటున్నారు. అసంపూర్తిగా ఉన్న రెండో అంతస్థులో చలికాలంలో చలికి, వర్షా కాలంలో వర్షానికి, ఎండాకాలంలో వడగాలులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ముఖ్యంగా పాఠశాలలోని విద్యార్థులు రెండో అంతస్థులో తలుపులు, కిటికీలు, కింద బండలు లేకుండానే భవనంలోకి విద్యార్థులు తమ పెట్టెలు, దుస్తులు, పెట్టుకొని తీవ్రంగా ఇబ్బందులు పడుతూ చదువులు కొనసాగిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం వరకైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు అసంపూర్తిగా ఉన్న కేజీబీవీ పాఠశాలకు పూర్తి స్థాయిలో ప్రహరీ నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న మిగతా రెండు అంతస్థుల భవనాన్ని పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



అసంపూర్తిగా ఉన్న కేజీబీవీ పాఠశాల భవనం



కిటికీలు, తలుపులు లేని హాల్లో ఉన్న విద్యార్థుల వస్తువులు

**అసౌకర్యాలతో ఇబ్బందులు**

పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనంతో, ప్రహరీ పూర్తి స్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, పూర్తి స్థాయిలు పనులు ముగించి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి.



- పావని, ఎస్‌వో

## నేడు పట్టణంలో విద్యుత్‌కోత

పాలమూరు, మే 14 : మహబూబ్‌నగర్ పట్టణంలో 11 కేవీ వెంకటేశ్వరకాలనీ, 11కేవీ లక్ష్మీనగర్‌కాలనీ ఫీడర్‌లో అత్యవసరంగా మరమ్మతులు చేపడుతుండటంతో తాత్కాలికంగా విద్యుత్‌కోత విధిస్తున్నట్లు సెక్షన్-3 ఏఈ భగవంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరకాలనీ, సాయిబాబాగుడి ఏరియా, లక్ష్మీనగర్ కాలనీ, రూరల్ పోలీస్‌స్టేషన్, పద్మావతికాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా, ప్రేమ్‌నగర్, సద్దలగుండు ఏరియాలో విద్యుత్‌కోత విధిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌కోత విధిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బం దికి పట్టణ ప్రజలు సహకారం అందజేయగలరని కోరారు.

## మార్కెట్‌లో ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, మే 14 : మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు తమ ధాన్యాన్ని విక్రయించడానికి దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. ధాన్యం కొనుగోలు జోరుగా కొనసాగుతోంది. వేలం ధరలో పెద్ద సోనా ఆర్ఎన్ఆర్ గరిష్ఠంగా రూ.2302, కనిష్ఠంగా రూ.1952, పెద ఆముదాలు గరిష్ఠంగా రూ.5450, కనిష్ఠంగా రూ.5445, పెద్దసోనా 72 క్వింటాళ్లు, ఆముదాలు 8క్వింటాళ్లు అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

## రెండు నెలల తర్వాత అంత్యక్రియలు

**- చైనా నుంచి మంగళవారం**

**మల్లేపల్లికి వచ్చిన వచ్చిన భౌతికకాయం**

రాజాపూర్, మే 14 : మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చైనా దేశంలో మృతిచెందగా, రెండు నెలల తర్వాత మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. వివరాల్లోకి వెళ్తే..

మల్లేపల్లి గ్రామానికి చెందిన సేవకుల జ్ఞానానంద్ చిన్నపాటి తోళ్ల వ్యాపారం చేసేవాడు. ఇతని కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉండేవారు. తోళ్లవ్యాపారం నిమిత్తం చైనా, ఇతర దేశాలకు వెళ్లి వచ్చేవాడు. గత మార్చి నెలలో చైనాకు వెళ్లగా, అదే నెల 17న ఆ దేశంలనే గుండెపోటుకు గురై మృతిచెందాడు. అక్కడి నుంచి జ్ఞానానంద్ మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించడానికి ఇన్నాళ్లు పట్టింది. భారత విదేశీ రాయబార కార్యాలయం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అతని మృతదేహాన్ని తెప్పించడానికి కృషి చేశారు. ఎట్టకేలకు మంగళవారం మృతదేహం తెలంగాణ రాష్ట్రానికి రాగా, సాయంత్రం స్వగ్రామం మల్లేపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని తెప్పించడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డాకుల, మే 14 : అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన మునగల జెకరయ్య అనారోగ్యంతో మంగళవారం చనిపోవడంతో 1990 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు జెకరయ్య మృతదేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు కొంత ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కెంచె చంద్రశేఖర్, దానియేల్, లక్ష్మీనరసింహ, కేబీ సత్యం, నేతాజీ, రమేశ్, యెహోహ, రాజాగౌడ్, శివదేవాచారి, శ్రీనివాస్‌రెడ్డి, అచ్యుత్‌రెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.

● అదేవిధంగా మూసాపేట మండల కేంద్రంలో గుండెపోటుతో చనిపోయిన బీఆర్ఎస్ కార్యకర్త గొల్లరాజు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న 38,352 మంది ఓటర్లు

కోయిలకొండ మే 14 : మండలంలో పార్లమెంట్ ఎన్నికల్లో 61 పోలింగ్ బూత్‌లలో 54,969 ఓటర్లకు గాను 38,352 మంది ఓటర్లు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఇందులో పురుషులు 27వేల 545 మంది, మహిళలు 27,423 మంది, ఒకరు ఇతరులు ఉన్నారని పేర్కొన్నారు. కోయిలకొండ మండలంలో గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు 84శాతం ఓటు హక్కు వినియోగించుకోగా, పార్లమెంట్ ఎన్నికల్లో 70శాత ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సారి వలస ఓటర్లు పెద్దగా రాలేదు.

## ఆదమరిస్తే అంతే...

**- రోడ్లపైనే వరి కుప్పలు.. ప్రమాదాలకు నెలవులు**



అల్లీపురం గ్రామ శివారులో రోడ్డుపై వరి కుప్పలు

చిన్నచింతకుంట, మే 14 : మండంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారుల పక్కన ధాన్యం కుప్పలు వాహనచోదకులు బెంబేలెత్తిస్తున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న గుబులు వాహనచోదకులకు నెలకొంది. కనిపించని మలుపుల వద్ద కూడా ధాన్యం ఆరబోయటంతో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవటంతో వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.